క్లుప్తంగా

వీరమ్మతల్లి తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు



ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లకు భక్తజనం పోటెత్తారు. ఆదివారం వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తజనం వేలాదిగా తరలిరావటంతో ఉయ్యూరు పట్టణం వీరమ్మతల్లి నామస్మరణతో మారుమోగింది. డప్పు వాయిద్యాలతో గ్రామాల నుంచి ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకుని భక్తిపారవశ్యం చెందారు. ఆలయ పరిసరాలతో పాటుగా ప్రధాన రహదారులు భక్తజనసంద్రంగా మారింది. జై వీరమ్మ.. జైజై వీరమ్మ అంటూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి దర్శనానికి గంటల సమయం పట్టింది. ఆలయం భక్తులతో నిండిపోవటంతో భక్తులు ధ్వజస్తంభం వద్దే మొక్కులు చెల్లించుకుని వెనుతిరిగారు. సీఐ హబీబ్ బాషా, ఎస్ఐ గణేష్‌కుమార్ బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు.

యనమలకుదురులో మంత్రి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. కొండపై రోడ్డు, కాటేజీల నిర్మాణం, గిరి ప్రదక్షిణకు రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు




మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో మాఘమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన శ్రీచక్రార్చన, కుంకమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

380 మందికి వైద్య పరీక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వయో వృద్ధుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో ప్రముఖ అల్లోపతి, ఆయుర్వేదం, హోమియో వైద్య నిపుణులతో ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించటంతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. వయోవృద్ధులు ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, డాక్టర్ శరత్‌చంద్ర ఎండలు పెరుగుతున్న దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సీజనల్ పండ్లు కూరగాయలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 380 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఘనంగా అమ్మవారి రథోత్సవం



పెనమలూరు: పెద పులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటలకు శ్రీసుందరేశ్వర స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం 108 మంది దంపతులచే చండీహోమం నిర్వహించారు. భక్తులు కుంకుమార్చన, సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో చేశారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ అనుగ్రహభాషణ చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.











గ్రూప్ - 2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్ – 2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే అభ్యర్థులు చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులను తనిఖీ చేసిన అనంతరం పరీక్షకు అనుమతించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించడంతో ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నగరాల అభ్యున్నతికి వైఎస్ కుటుంబం అండగా నిలిచింది



మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్, వేదికపై మేయర్ భాగ్యలక్ష్మి, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ఉన్న నగరాల సంఘీయుల అభ్యున్నతికి వైఎస్ కుటుంబం అండగా నిలిచిందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నగరాల సంఘీయుల ఆత్మీయ సమావేశాన్ని స్థానిక మాడపాటి క్లబ్ ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గంలో మాజీ శాసనసభ్యులు మరుపిళ్ల చిట్టి, తమ్మిన పోతరాజు, పోతిన చిన్నా తదితరులు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. అదే సమయంలో పలువురు ముస్లింలు ఈ నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రులుగా కూడా పని చేశారన్నారు. నగరాలు, మైనార్టీలు పశ్చిమంలో ఒకరికొకరు సాయం చేసుకుంటూ సత్సంబంధాలను కొనసాగించారని గుర్తు చేశారు. అందువలనే ఒకరికొకరు ఎన్నికల్లో సాయం చేసుకుంటూ ముందుకు సాగారని వివరించారు. అదే క్రమంలో మైనార్టీ నేతగా వైఎస్సార్ సీపీ తనను ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించిందన్నారు. నగరాలు తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నగరాలను బీసీల్లో చేర్చారని, అలాగే అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తిస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీవో ఇచ్చిన విషయాలను వివరించారు. అంతేకాకుండా నగరాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ గడిచిన 14 సంవత్సరాల్లో నగరాలకు ఎటువంటి గుర్తింపు ఇవ్వలేదన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ వంటి పెద్ద నగరానికి మేయర్‌గా నగరాలకు చెందిన రాయన భాగ్యలక్ష్మికి అవకాశం కల్పించారన్నారు. అలాగే దుర్గగుడి చైర్మన్‌గా పైలా సోమినాయుడుకు అవకాశం కల్పించారన్నారు. భాగ్యలక్ష్మి మేయర్‌గా నగరాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. తాను నగరాలకు అండగా ఉంటానని, తనకు సాయంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

ఆసిఫ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి విషయంలోనూ నగరాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి గౌరవించారన్నారు. శ్రీశైలంలో స్థలాన్ని కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా ఏది అడిగినా కాదనకుండా ముఖ్యమంత్రి సాయమందించారని వివరించారు. స్థానికంగా ఆసిఫ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి నగరాల సంఘీయులందరూ అండగా ఉండాలని కోరారు. ఏపీ నగరాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, ఏపీ నగరాల సంఘం అధ్యక్షుడు బాయన బాబూజీ (బాబ్జీ)లు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అందించిన చేయూతను వివరిస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నేత రాయన నరేంద్ర, కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, ఏపీ నగరాల కార్పొరేషన్ సభ్యులు శీరం వెంకట్రావు, మజ్జి శ్రీదేవి శ్రీనివాస్, పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిళ్లా రవి, సినీ నటుడు పిళ్లా ప్రసాద్, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, మాజీ కార్పొరేటర్ కొరికొనా అనూరాధ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు, నాయకులు బాయన శేఖర్‌బాబు, బంకా చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో పది, ఇంటర్మీడియెట్ విద్యార్థుల పరీక్షా సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదివారం శ్రీ సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ అష్టోత్తర, సరస్వతీ పూజ, మేధా దక్షిణామూర్తి హోమం, సరస్వతీ హోమం విద్యార్థులచే ఉచితంగా చేయించారు. విద్యార్థుల హాల్ టికెట్లను సరస్వతీ అమ్మవారి ముందు ఉంచి పూజలు నిర్వహించారు. విద్యార్థులకు పెన్ను, సరస్వతీ అమ్మవారి ప్రతిమ, రక్ష, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, సభ్యులు విశ్వేశ్వరయ్య, జగన్, రాజా, అర్చకుడు శిష్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతినకు సత్కారం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా పోతిన శ్రీనివాసరావుకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని సంఘ అధ్యక్షుడు ఎన్వీ.రావు పేర్కొన్నారు. కేఎల్ రావు నగర్‌లోని శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ కార్యాలయానికి ఆదివారం పోతిన శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా పోతిన శ్రీనివాసరావును ఎన్వీ.రావుతో పాటు పలువురు సంఘ ప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సామాజిక వర్గ ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎన్వీ.రావు కోరారు. సీఎం తనకు ఇచ్చిన అవకాశాన్ని సామాజిక వర్గ ప్రజల అభ్యున్నతి కోసం వినియోగిస్తానని పోతిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంఘ ఉపాధ్యక్షులు పిళ్లా రవి, శ్రీరామ్ వెంకట్రావు, కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఆర్, రాంపిళ్ల వాసు, పాట్నూరి శివ, ఇలిపిల్ల ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం శ్రీవారి మహా పుష్పయాగం

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామి వారి పుష్పయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మహాపుష్పయాగం ఆదివారం కమనీయంగా జరిగింది. బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన వివిధ రకాల సుగంధ పరిమళాలను వెదజల్లే పలు రకాల పుష్పాలతో కలియుగ దైవమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అర్చకస్వాములు పుష్పయాగాన్ని నయనానందకరంగా నిర్వహించి భక్తులను తరింపజేశారు. గులాబీ, తులసీ, మల్లె, చామంతి వంటి విభిన్న జాతి పుష్పాలతో జరిగిన పుష్పయాగాన్ని తిలకించిన భక్తులు తన్మయులయ్యారు. ఉత్సవమూర్తులను పూర్తిగా పూలతో కప్పే విధంగా వందలాది కిలోల పుష్పాలతో ఈ యాగాన్ని నిర్వహించారు. అలంకార ప్రియుడైన నారాయణుడు ఈ సేవతో మరింత పులికించి భక్తులను అనుగ్రహిస్తాడని పండితులు తెలిపారు. వేద పఠనం, మేళతాళాలు, సంకీర్తనాగానాలు, మంత్రోచ్ఛరణలు, భక్తులు శ్రీహరి నామ స్మరణల మధ్య స్వామి వారి పుష్పయాగం జరిగింది. ప్రముఖ ఆగమ పండితులు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా తిరుమంజనం

ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి తిరుమంజన సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. పంచామృతాలు, చందనం వంటి సుగంధ పరిమళ ద్రవ్యాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అభిషేకించిన అర్చకస్వాములు పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, చైర్మన్లు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శాశ్వత బ్రహ్మోత్సవ ఉభయ దాతలను, ఉత్సవాలకు సహకరించిన దాతలను సత్కరించారు.

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీపై అధిష్ఠింపజేసి వివిధ రకాల సేవలతో 12 మార్లు ఆలయంలో ప్రదక్షిణలను నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సహకరించిన అందరికీ ఆలయ ఈఓ ఘంటసాల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

ఘనంగా లార్డ్ బాడెన్ పావెల్ జయంతి



నివాళులర్పిస్తున్న రాజారావు, వర కుమార్, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో స్కౌట్స్ – గైడ్స్ విద్యార్థులతో ఆల్ ఫెయిత్ ప్రేయర్(సర్వమత ప్రార్థన)ను స్కౌట్స్ ఉపాధ్యాయులు బీఎస్ వరప్రసాద్ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఆద్యుడు బాడెన్ పావెల్ చిరస్మరణీయుడన్నారు. బాల బాలికల్లో దేశభక్తిని పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దటానికి ప్రారంభించబడినదే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం అని తెలిపారు. ఇందులో బాలుర బృందాలను స్కౌట్స్ అని, బాలికల బృందాలను గైడ్స్ అని అంటారన్నారు. అత్యవసర సమయాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు రంగంలోకి దిగి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మైనార్టీలకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న సంఘ పెద్దలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో మైనార్టీ వర్గాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. రాజపురోహిత్ సంఘ ఆధ్వర్యంలో పాతబస్తీలోని స్థానిక మహేశ్వరి భవన్‌లో రాజస్థాన్ శ్రీ కేతేశ్వర్ భగవాన్ జాగరణ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో అన్ని మతాలు, కులాలు చక్కని శాంతియుత వాతావరణంలో జీవిస్తున్నాయన్నారు. పాతబస్తీలో ముస్లింలు, క్రైస్తవులతో పాటుగా ఉత్తర భారతీయులుగా ఉన్న జైనులు, రాజపురోహిత్‌లు, మహేశ్వరిలు, మర్వాడీలు వంటి మైనార్టీల పక్షాన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించి గౌరవిస్తుందన్నారు. అదే క్రమంలో జైనులకు చెందిన మనోజ్‌కొఠారిని ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా ఏ సమస్య ఎదురైనా స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, తాను అండగా ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావటానికి అండగా ఉండాలని కోరారు. ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, సంఘ పెద్దలు ఓంజీ, అజిత్‌సింగ్ రాజ్‌పురోహిత్, మహీధర్‌సింగ్ రాజ్‌పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

దైవ సహాయంతోనే విజయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవుడు ఏ సంకల్పం తలపెట్టినా దైవ సహాయంతోనే విజయం కలుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. విద్యాధరపురం సంజయ్ గాంధీ కాలనీలో ది గాస్పెల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన పెనూయేలు గాస్పెల్ హాల్ ప్రార్థన మందిరంలో సంఘ కాపరి బ్రదర్ ఎస్ ఆనంద్ బాబు నేతృత్వంలో నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఆధ్వర్యంలో ఆసిఫ్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు అందరికీ ప్రభువని, ఆయన చూపిన సత్య మార్గం, కరుణ, దయ వంటి బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, మండల శ్రీనివాస్, రమణ, జిలాని తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారిణికి వాషింగ్టన్ యూనివర్సిటీ డాక్టరేట్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి కళాకారిణి బి.స్వర్ణలతకు అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ నెల 24న బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ పీస్ కాన్ఫరెన్స్‌లో యూనివర్సిటీ వలు రంగాలకు చెందిన వారికి డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. అందులో భాగంగా కూచిపూడి కళాకారిణి స్వర్ణలతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఐఈఎస్ సలహాదారు శివప్ప, సెక్రటరీ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ ఏలూరి, ఆ యూనివర్సిటీ డైరెక్టర్ నీలమణి తదితరుల నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

38వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్ సీపీ ఆఫీస్‌ను ప్రారంభించిన ఆసిఫ్, రెహమతున్నీసా, హయత్ షరీఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, ఆమె కుమారుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి షేక్ హయత్ షరీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, స్థానిక కార్పొరేటర్ రెహమతున్నీసాతో కలిసి ప్రారంభించారు. అనంతరం దివంగత మహానేత వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మరిన్ని సేవలు అందించేందుకు పార్టీ కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కార్యాలయంగాకూడా ఉపయోగపడుతుందన్నారు. డివిజన్ ప్రజలకు ఏ సమస్య వచ్చినా కార్యాలయానికి వచ్చి తెలియ చేస్తే సత్వరమే పరిష్కారం లభిస్తుందన్నారు. మీకు మంచి జరిగితేనే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయాలని ధైర్యంగా పిలుపునిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ రాష్ట్రానికి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, కార్పొరేటర్ ఎండి ఇర్ఫాన్, పాత శివాలయం చైర్మన్ బొమ్ము మధు, నాయకులు విశ్వనాథ రవి, దేరంగుల రమణ, ఎస్‌కే నజీర్, డీ రాంప్రసాద్, బీ శాంతి, విజయ్, రవూఫ్, బాజా బాబా, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో సౌరశక్తి వినియోగం పెరుగుతుంది



ఫణిచంద్రను సన్మానిస్తున్న నిర్వాహకులు

పటమట(విజయవాడతూర్పు): రానున్న రోజుల్లో సౌరశక్తి వినియోగం పెరుగుతుందని ఏపీ ఎనర్జీ కమిటీ వైస్ చైర్మన్ బి.ఫణిచంద్ర అన్నారు. వాసవ్య మిత్రమండలి, సమ భావన మిత్ర మండలి విజయవాడ శాఖ సమావేశం టీచర్స్ కాలనీలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫణిచంద్ర మాట్లాడుతూ సౌర శక్తి కోసం కొండలపైనా, నదులపైనా, ఇళ్లపైనా పరికరాలను అమర్చుకోవచ్చన్నారు. ప్రస్తుతం 42 శాతం సౌర శక్తి వినియోగంలో ఉందన్నారు. 2030 నాటికి 500 కిలోవాట్‌లు వాడుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని చెప్పారు. దీనికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. అనంతరం ఫణిచంద్రను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అయా సంఘాల ప్రతినిధులు టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సీహెచ్.వెంకటరెడ్డి, డాక్టర్ ఎం.వి.రావు, కొండపల్లి మాధవరావు, గోళ్ల నారాయణరావు, కె.భీమేశ్వరరావు, కె.భాస్కరరావు, డాక్టర్ జంధ్యాల శంకర్, ఆచార్య ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కేసరపల్లిలోని జాస్తి చంద్రమౌళి సదన్‌లో ఉత్సాహంగా జరిగింది. పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులందరూ 40 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై తిరిగి కలుసుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘ నేతలు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి దేశ, విదేశాల్లో స్థిరపడిన మిత్రులందరూ హాజరుకావడం సంతోషకరమన్నారు. ప్రతి ఏటా ఆత్మీయ సమ్మేళనం జరపాలని నిర్ణయించారు.